# సాక్షి
## అన్నమయ్య జిల్లా
సోమవారం। 1। సెప్టెంబర్। 2025






**చిత్తూరు, నెల్లూరు జట్లు భారీ స్కోరు**

చిత్తూరు, నెల్లూరు జట్లు భారీ స్కోర్లు చేశాయి. ఆదివారం రెండవ రోజు కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్‌ మైదానంలో చిత్తూరు–కడప జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. -8లో



**జీవితాన్ని చదివేద్దాం.. బతికి సాధిద్దాం**

యువత వివిధ కారణాలతో క్షణికావేశంతో ప్రాణాలు తీసుకుంటున్నారు. విద్యార్థులు జీవితాన్ని చదవాలి.. బతికి సాధించాలి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.210 | రూ.270 |
| రెండోరకం | రూ.150 | రూ.210 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 108 మెట్రిక్‌ టన్నులు



# హామీలు పుట్టెడు.. అమలు ఎప్పుడు?

- బాబు ఇచ్చిన హామీల అమలుకు ఎదురుచూపులు
- అన్నమయ్య ప్రాజెక్టుకు పడని అడుగులు
- అధికారంలోకి వచ్చినా మదనపల్లె వైద్య కళాశాలను పట్టించుకోని వైనం
- హార్టికల్చర్‌ హబ్‌ అని ఎన్నిమార్లు చెప్పినా అతీగతీ లేని స్థితి
- కొత్త జిల్లాలపై స్పష్టత ఇవ్వాలంటున్న ప్రజలు
- నేడు రాజంపేటకు రానున్న సీఎం చంద్రబాబు



వరదల్లో కోతకు గురైన అన్నమయ్య డ్యాం (ఫైల్‌)

**సాక్షి రాయచోటి:** సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు....అన్నింటికీ నాదే బాధ్యత అంటూ చంద్రబాబు చెప్పిన మాటలను ప్రజలు గుర్తు చేస్తున్నారు. బాబు గారూ గుర్తున్నాయా? అంటూ అడుగుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన బాబు గారి మాటలకు అర్థాలే వేరులే అన్నట్లు పరిస్థితి కనిపిస్తోంది. అధికారంలోకి వస్తే ఒకటేమిటి...అనేక రకాలుగా జిల్లాను తీర్చిదిద్దుతామని చెప్పినప్పటికీ ఇప్పటికీ అడుగులు పడలేదు. అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా అభివృద్ధి జాడ కనిపించలేదు. అక్కడక్కడ రోడ్లు తప్ప జిల్లాలో అభివృద్ధి పనుల జాడ చూస్తే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పరిస్థితి కనిపిస్తోంది. రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో పర్యటించిన చంద్రబాబు ప్రతిపక్ష నేత హోదాలో అధికారంలోకి రాగానే రూపురేఖలు మారుస్తామన్న హామీల అమలులో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదని మేధావులు అభివర్ణిస్తున్నారు.

**హార్టికల్చర్‌ హబ్‌ మాటేమిటి?**

2014లో రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చేముందు...వచ్చిన తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు జిల్లాకు అనేక హామీలు ఇచ్చారు. ప్రధానంగా రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతంలో బొప్పాయి, మామిడి, అరటి, ఇతర అనేక రకాల పండ్ల తోటలు సాగులో ఉన్న దృష్ట్యా హార్టికల్చర్‌ హబ్‌గా చేస్తానని ఒక్కసారి కాదు...అనేకమార్లు హామీ గుప్పించారు. కానీ నాటి నుంచి నేటివరకు కనీసం ఒక్క అడుగు కూడా ముందు పడలేదు. ఇప్పటికే ఈ ప్రాంత ఉద్యాన రైతులు గిట్టుబాటు ధరలు లేక ఇతర అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారు. అయితే బాబు ఇచ్చిన హామీ రూపు దాల్చకపోవడంతో ఇప్పటికీ అన్నదాతల కష్టం ఎవరూ తీర్చలేనిదిగా మారిపోయింది. వైఎస్సార్‌, అన్నమయ్య జిల్లాలకు వచ్చిన ప్రతిసారి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అనేకమార్లు హామీలు ఇచ్చినా ఉద్యాన హబ్‌ నిర్మాణం జరగలేదు.



**రాయచోటిలో కనిపించని అభివృద్ధి**

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో సార్వత్రిక ఎన్నికలకు పది రోజుల ముందుగా భారీగా హాజరైన జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించిన సందర్భంలో చంద్రబాబు రాయచోటి రూపురేఖలు మారుస్తామని చెప్పినా కనీసం పెండింగ్‌ పనులకు మోక్షం లేదు. గత వైఎస్సార్‌ సీపీ హయాంలో చేపట్టిన అనేక రకాల అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రత్యేకంగా రాయచోటికి కూటమి సర్కార్‌లో నిధుల వర్షం కురవలేదు. మధ్యతరగతి ప్రజలకు సంబంధించిన ఎంఐజీ లే అవుట్‌, శిల్పారామం, క్రికెట్‌ స్టేడియం, నగర వనం, ఇతర అనేక అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు కనిపిస్తున్నాయి.

**మదనపల్లె మెడికల్‌ కళాశాలపై నీలి నీడలు**

మదనపల్లె అభివృద్ధికి చాలా హామీలు ఉన్నా అమలు దిశగా అడుగులు పడటం లేదు. రోడ్లు మొదలుకొని మార్కెట్ల వరకు ఎన్నెన్నో మార్పులు తీసుకు వస్తామన్నా క్షేత్ర స్థాయిలో ఆవగింజంత కూడా అభివృద్ధి కనిపించడం లేదు. పైగా వైఎస్‌ జగన్‌ సర్కార్‌ మదనపల్లెకు మెడికల్‌ కళాశాల మంజూరు చేసి భవనాలు కూడా నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించాలని ఏర్పాట్లు చేసినా అధికారంలోకి వచ్చిన తర్వాత సీట్లను కూడా కేటాయించకపోవడంతో కళాశాలపై నీలినీడలు అలుముకున్నాయి. రానున్న కాలంలో మెడికల్‌ కళాశాల ఉంటుందా? ఉండదా? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.

**‘అన్నమయ్య’కు మోక్షం ఎప్పుడో?**

జిల్లాలో భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీటి ప్రవాహానికి పింఛాతోపాటు అన్నమయ్య ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. అయితే అప్పటి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అన్నమయ్య ప్రాజెక్టును మహోన్నత ఆశయంతో నూతన టెక్నాలజీ ద్వారా నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి....టెండర్ల వరకు తీసుకు వచ్చినా తర్వాత అధికార పగ్గాలు చేపట్టిన కూటమి సర్కార్‌ టెండర్లను రద్దు చేసింది. అంతేకాకుండా మళ్లీ రీ డిజైన్‌ చేసి ప్రతిపాదనల దశలోనే మూలుగుతోంది. మరీ ప్రాజెక్టు ఎప్పుడు కడతారో సీఎం గారు చెప్పాలని రాజంపేట నియోజకవర్గ ప్రజలు చెబుతున్నారు. అంతేకాకుండా కూటమి సర్కార్‌ ఏర్పడిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ కూడా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అనేక హామీలు ఇచ్చారు. వాటిని అమలు చేయలేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు.

**జిల్లాలో మార్పులు చేర్పులపై ఆందోళన**

వైఎస్సార్‌సీపీ సర్కార్‌ హయాంలో అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని ప్రకటించి అభివృద్ధి చేస్తూ వచ్చింది. అయితే ప్రస్తుతం మండలాలు, నియోజకవర్గాలతోపాటు జిల్లా కేంద్రాల మార్పులు, చేర్పులపై ఊహాగానాలు వెలువడుతున్న తరుణంలో ప్రజల్లో రోజురోజుకు ఆందోళన రేకెత్తుతోంది. అయితే గతంలో రాజంపేటతోపాటు మదనపల్లెలను జిల్లాలుగా మారుస్తానని హామీ ఇచ్చారు. అయితే రాయచోటిని కూడా జిల్లా కేంద్రంగా కొనసాగిస్తూనే అభివృద్ధి చేస్తానని బాబు జనాల సాక్షిగా మాటిచ్చారు. ప్రస్తుతం అటు మదనపల్లె, ఇటు రాయచోటి, రాజంపేటల్లోనూ ఎక్కడికక్కడ జిల్లాల విషయంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాల విభజనపై స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏది ఏమైనా సీఎం హోదాలో చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేస్తే ఊహాగానాలకు తెరపడుతుందని ప్రజలు భావిస్తున్నారు.




# పార్వతీ తనయా.. పాహిమాం

- అట్టహాసంగా గణేష్‌ నిమజ్జన సంబరాలు
- పీలేరు పట్టణంలో భారీ ఊరేగింపు
- సాంస్కృతిక కార్యక్రమాలతో పులకించిన పీలేరు



అయ్యపునాయుని చెరువులో గణేష్‌ నిమజ్జనం



ప్రత్యేక ఆకర్షణగా గణనాథుడి విగ్రహం

**పీలేరు/రాయచోటి:** ఐదు రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు ఆదివారం గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లా వ్యాప్తంగా 1500 విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.డప్పుచప్పుళ్లు, మేళతాళాల మధ్య భక్తులు గణపతికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నంబర్ల ప్రకారం వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

- పీలేరు పట్టణంలో గణేష్‌ నిమజ్జన సంబరాలు అంబరాన్నంటాయి. గణేష్‌ విగ్రహాలను ఆదివారం అంగరంగవైభంగా నిమజ్జనం చేశారు. ఉదయం 10 గంటల నుంచే పట్టణంలో ఊరేగింపు కార్యక్రమం మొదలైంది. స్థానిక నెహ్రూబజార్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఊరేగింపుగా వచ్చిన విగ్రహాలకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు.



ఊరేగింపులో కేరళ కళాకారులు

## న్యూస్‌రీల్‌

### పబ్లిక్‌ గ్రీవెన్స్‌ రద్దు

**రాయచోటి:** జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న పబ్లిక్‌ గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్‌ ఛామకూరి శ్రీధర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేటలో సీఎం పర్యటన నేపథ్యంలో గ్రీవెన్స్‌ సెల్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసాలతో జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావద్దని కోరారు.

### రెడ్డెమ్మతల్లీ..కరుణించమ్మా



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

**గుర్రంకొండ:** మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తులు కరుణించమ్మా అంటూ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి ఉదయాన్నే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు తలనీలాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

### తైక్వాండో పోటీల్లో ప్రతిభ



క్రీడాకారులతో నిర్వాహకులు

**కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌:** అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో నిర్వహించిన రాయలసీమ స్థాయి తైక్వాండో పోటీల్లో వైఎస్సార్‌ కడప జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారని జిల్లా తైక్వాండో వైస్‌ ప్రెసిడెంట్‌ వెంకటేష్‌, కార్యదర్శి విజయ్‌ భాస్కర్‌ పేర్కొన్నారు. మాస్టర్‌ రవిశంకర్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. సబ్‌ జూనియర్‌ విభాగంలో వేదాష్‌, కె. భాను చేతన్‌ రెడ్డి, జితేష్‌ రెడ్డి, రెడ్డెమ్మ, చరణ్‌ సాయి, హేమశ్రీ స్వర్ణపతకాలు కైవసం చేసుకున్నారన్నారు. మణికంఠ రజత పతకం, సుషాత్‌, వర్షిత్‌, నాగ చైతన్య గౌడ్‌, సాజియా, వైష్ణవి, నవ్యశ్రీ, కీర్తి, మౌనిష్‌, మోక్షిత్‌, హర్షవర్దన్‌ రెడ్డి కాంస్యపతకాలు సాధించారని చెప్పారు.

# నేడు రాజంపేటకు ముఖ్యమంత్రి రాక

**రాజంపేట:** నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారు. పర్యటనకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్‌ శ్రీధర్‌ చామకూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు అనుగుణంగా వేదిక నిర్మాణం, పాల్గొనే లబ్ధిదారులు కూర్చవడానికి అవసరమైన సదుపాయాలు, తాగునీటి వసతి, శానిటేషన్‌, పార్కింగ్‌ సంబంధిత ఏర్పాట్లన్నీ పూర్తి అయినట్లు తెలిపారు. ఎటువంటి లోపాలు లేకుండా అధికార బృందాలు సకాలంలో పనులు పూర్తి చేసారన్నారు. సీఎం స్వయంగా పలుకరించబోయే రజక లబ్ధిదారుల జాబితా, వారికి అందించేబోయే ప్రయోజనాలు, సౌకర్యాలు క్షుణ్ణంగా సమీక్షిస్తారన్నారు. సమావేశానికి హాజరైయ్యే ప్రజలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేదిక వద్దకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వేదిక పరిసరాల్లో ట్రాఫిక్‌ నియంత్రణ, పబ్లిక్‌ అండ్‌ సిస్టమ్‌, సీసీ కెమరాలు, క్షేత్రస్థాయి భధత్రా బలగాలను విస్తృతంగా మోహరించామన్నారు. పర్యటన ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్‌తో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఎఎస్పీ వెంకటాద్రి జెసీ ఆదర్శరాజేంద్రన్‌, సబ్‌కలెక్టర్‌ భావన, మదనపల్లె సబ్‌కలెక్టర్‌ చల్లా కల్యాణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



బోయనపల్లెలో సీఎం పర్యటన సంబంధించి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్‌ శ్రీధర్‌ చామకూరి

**ముఖ్యమంత్రి పర్యటన ఇలా..**

సోమవారం ఉదయం 11.50 గంటలకు రాజంపేట మండలంలోని మన్నూరులోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 12.15 గంటలకు పెద్దకారంపల్లెకు చేరుకుంటారు. ఫించన్‌ లబ్ధిదారులతో ఇంటరాక్ట్‌ అవుతారు. బోయనపల్లెలని దోబిఘాట్‌ వద్ద రజకులతో సీఎం భేటి అవుతారు. 1.15 గంటలకు ప్రజావేదిక వద్దకు చేరుకుంటారు. అక్కడే ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తారు. సాయంత్రం 4.40 గంటలకు హెలిప్యాడ్‌ చేరుకొని తిరుగుపయనం అవుతారు.

# నేటి నుంచి వైఎస్‌ జగన్‌ పులివెందుల పర్యటన

2న ఇడుపులపాయలో తండ్రి వైఎస్సార్‌ సమాధి వద్ద నివాళి, ప్రత్యేక ప్రార్థనలు

**పులివెందుల:** మాజీ సీఎం, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం నుంచి మూడు రోజులపాటు పులివెందులలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన వివరాలను పార్టీ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్‌ 1వ తేదీన మధ్యాహ్నం 1.30గంటలకు బెంగళూరులోని తన నివాసం నుంచి బయలుదేరి జక్కూరు ఎయిర్‌డ్రోంకు 1.50గంటలకు చేరుకుంటారు. 2గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 2,.50గంటలకు పులివెందులలోని స్థానిక భాకరాపురంలో ఉన్న హెలీప్యాడ్‌ వద్దకు చేరుకుంటారు. 2.55గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3.గంటలకు పులివెందులలోని తన క్యాంపు ఆఫీస్‌కు చేరుకుంటారు. 3 నుంచి రాత్రి 7.30 వరకు క్యాంపు ఆఫీస్‌లో ప్రజలతో మమేకం కానున్నారు. 7.30కి క్యాంపు ఆఫీస్‌ నుంచి బయలుదేరి 7.35కు తన నివాసానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేయనున్నారు. సెప్టెంబర్‌ 2న వైఎస్సార్‌ వర్ధంతి సందర్భంగా ఉదయం 6.45గంటలకు పులివెందులలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గాన నేరుగా ఇడుపులపాయకు బయలుదేరతారు. 7.15గంటలకు ఇడుపులపాయలోని వైఎస్సార్‌ ఘాట్‌కు చేరుకుంటారు. ఉదయం 7.15గంటల నుంచి 8గంటలవరకు వైఎస్సార్‌ ఘాట్‌ వద్ద తండ్రి వైఎస్సార్‌కు నివాళులర్పించడంతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. 8గంటలకు ఇడుపులపాయ వైఎస్సార్‌ ఘాట్‌ నుంచి రోడ్డు మార్గాన లింగాల మండలం అంబకపల్లె గ్రామానికి బయలుదేరుతారు. 10.30గంటలకు అంబకపల్లెకు చేరుకుంటారు. 10.30 నుంచి 11.30 వరకు అంబకపల్లె గ్రామంలోని గంగమ్మ కుంట చెరువు వద్ద నీటికి జలహారతి ఇవ్వనున్నారు. 11.30కి అంబకపల్లె గ్రామం నుంచి బయలుదేరి 12.30కి పులివెందులలోని తన నివాసానికి చేరుకుంటారు. 2.25కు తన నివాసం నుంచి బయలుదేరి 2.30కి భాకరాపురంలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు. 2.30 నుంచి 7.25 వరకు తన క్యాంపు కార్యాలయంలో ప్రజలతో ఆయన మమేకం కానున్నారు. 7.30కి భాకరాపురంలోని తన నివాసానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే ఆయన బస చేయనున్నారు. సెప్టెంబర్‌ 3న ఉదయం 7గంటలకు భాకరాపురంలోని తన నివాసం నుంచి బయలుదేరి 7.05గంటలకు అదే ప్రాంతంలో ఉన్న హెలీప్యాడ్‌ వద్దకు చేరుకుంటారు. 7.15కు హెలీకాప్టర్‌ ద్వారా బెంగుళూరుకు బయలుదేరుతారు. 8.30గంటలకు యలహంకలో ఉన్న తన నివాసానికి చేరుకుంటారు.



# ఎక్సలెన్స్‌ బడులు

- ఆటలే పాఠాలు... పోటీలే పరీక్షలు.. పతకాలే ఫలితాలు
- సర్కారు బడుల్లో క్రీడా వికాసం
- స్పోర్ట్స్‌ ఎక్సలెన్స్‌ అవార్డులకు ఎంపిక

**మదనపల్లె సిటీ:** చిన్నారులకు సమగ్ర వికాసానికి చదువుతో ఆటపాటలూ అవసరమనేది అక్షర సత్యం. మార్కులు, ర్యాంకులకు ప్రాధాన్యమిస్తున్న ఈ కాలంలో ఉదయం నుంచి రాత్రి వరకు తరగతి గదుల్లోనే బాల్యం మగ్గిపోతోంది. ఎక్కువ శాతం పాఠశాలల్లో ఆటపాటలకు చోటే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో మదనపల్లె రూరల్‌ మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల, మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలు క్రీడల్లో తమదైన ముద్ర వేస్తున్నాయి. చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులతో నిత్యం సాధన చేయిస్తున్నారు. ఈ పాఠశాలల్లో తర్ఫీదు పొందిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికవుతూ సత్తా చాటుతున్నారు. అందుకే ప్రభుత్వం ఈ ఏడాది సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు మొదటి ర్యాంకుతో బెస్ట్‌ స్పోర్ట్స్‌ ఎక్సలెన్సీ అవార్డు–2024–25 ఎంపిక చేశారు. అలాగే మదనపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మూడవ ర్యాంకు సాధించి బెస్ట్‌ స్పోర్ట్స్‌ ఎక్సలెన్సీ అవార్డు దక్కించుకుంది. అవార్డులను సెప్టెంబర్‌ 5వతేదీ ఉపాధ్యాయ దినోత్సవం రోజున అందజేయనున్నారు.

**ముందంజలో జెడ్పీ క్రీడాకారులు:**

ఎస్‌జీఎఫ్‌ పోటీల్లో మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ముందజలో ఉన్నారు. ప్రధానంగా నెట్‌బాల్‌,హాకీ, బాల్‌బ్యాడ్మింటన్‌, త్రోబాల్‌, హ్యాండ్‌బాల్‌ క్రీడల్లో రాణిస్తున్నారు.

- మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు రోప్‌స్కిప్పింగ్‌, ఫుట్‌బాల్‌, బాస్కెట్‌బాల్‌, రెజ్లింగ్‌, కరాటే, అథ్లెటిక్స్‌ విభాగాల్లో రాణిస్తున్నారు. ఈ ఏడాది పాఠశాల నుంచి 60 మంది క్రీడాకారులు తొమ్మిది అంశాల్లో వివిధ స్థాయిల్లో ప్రాతినిధ్యం వహించారు. ముగ్గురు జాతీయ స్థాయి పోటీలకు, 44 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు మొదటి ర్యాంకు ప్రకటించారు. గత ఏడాది కూడా మొదటి స్థానం దక్కించుకున్నారు.



హాకీ ఆడుతున్న సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు



మూడవ స్థానం దక్కించుకున్న మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల

**మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు తృతీయ స్థానం:**

మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఈ ఏడాది 24–25 సంవత్సరానికి మూడవ ర్యాంకు సాధించారు. పాఠశాలలో రోప్‌స్కిప్పింగ్‌లో జాతీయ,రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థులు రాణిస్తున్నారు. దీంతోపాటు హాకీ, ఫుట్‌బాల్‌, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారు.గత 23–24 అయిదవ స్థానం వచ్చింది. 22–23 లో మొదటి స్థానం వచ్చింది.

**స్పోర్ట్స్‌ ఎక్సలెన్సీ అవార్డులకు ఎంపికైన పాఠశాలలు**

| పాఠశాల పేరు | స్థానం |
|---|---|
| జెడ్పీహెచ్‌ఎస్‌, సీటీఎం(మదనపల్లె) | ప్రథమ |
| జెడ్పీహెచ్‌ఎస్‌,మాసాపేట (రాయచోటి) | ద్వితీయ |
| జెడ్పీహెచ్‌ఎస్‌,మదనపల్లె | తృతీయ |
| జెడ్పీ హెచ్‌ఎస్‌ బొమ్మవరం, ఓబులవారిపల్లె | నాల్గవ |
| కెజీబీవీ , రామపురం | ఐదవ |

**పాఠశాలకు గుర్తింపు**



స్పోర్ట్స్‌ ఎక్సలెన్సీ అవార్డు రావడంతో పాఠశాలకు మంచి గుర్తింపు వచ్చింది. పాఠశాల జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడానికి వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు ఇచ్చారు. చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాము. –చంద్రశేఖర్‌,హెచ్‌ఎం, సీటీఎం జెడ్పీహెచ్‌ఎస్‌

**జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు**



పాఠశాలలో మెరికల్లాంటి క్రీడాకారులున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను కనబరుస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెస్తున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం రావడం సంతోషంగా ఉంది. –నాగరాజు పీడీ, సీటీఎం, జెడ్పీహెచ్‌ఎస్‌


**క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ**



క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. హెచ్‌ఎం సుబ్బారెడ్డి సహకారంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు నైపుణ్యం సాధించి ప్రతిభ కనబరుస్తున్నారు. మూడవ స్థానం రావడం సంతోషంగా ఉంది. –దేవకమ్మ, పీడీ, జెడ్పీహెచ్‌ఎస్‌, మదనపల్లె

## మహిళలకు కనీస రక్షణ, భద్రత కరువు

వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



మాట్లాడుతున్న వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

**సిద్దవటం:** రాష్ట్రంలో మహిళలకు కనీస రక్షణ, భద్రత కరువైందని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆరోపించారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. సిద్దవరం మండలంలోని కనుమలోపల్లి ఆకేపాటి గెస్ట్‌హౌస్‌లో ఆదివారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌ రెడ్డితో కలిసి ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హోంశాఖకు మంత్రిగా ఒక మహిళ ఉన్నా రాష్ట్రంలో మహిళలకు కనీస రక్షణ, భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్షనేత వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి మహిళా రక్షణకు, మహిళా సాధికారతకు పెద్దపీట వేశారన్నారు. 2017లో సుగాలి ప్రీతి దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడం జరిగిందన్నారు. జగన్‌ మోహన్‌ రెడ్డి 2019లో ముఖ్యంమత్రి అయ్యాక సుగాలి ప్రీతి కుటుంబానికి అండగా నిలిచారన్నారు. సుగాలి ప్రీతి తల్లిని పక్కన కూర్చోపెట్టుకొని 2024 ఎన్నికల సమయంలో పవన్‌ కళ్యాణ్‌ రాజకీయం చేస్తూ ఆ కేసును మొదట రీఓపెన్‌ చేస్తాం, నిందితులను శిక్షిస్తామని నమ్మబలకడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చాక సుగాలి ప్రీతి తల్లికి అపాయింట్‌ మెంట్‌ ఇవ్వలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

## క్లుప్తంగా

### హామీల ఊసెత్తని బాబు


మాట్లాడుతున్న అత్తింజేరి శ్రీనాథ్

రాజంపేట రూరల్ : ఎన్నికల సమయంలో రాజంపేటకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కదాని ఊసెత్తని సీఎం చంద్రబాబు ఏ ముఖం పెట్టుకొని రాజంపేటకు వస్తున్నాడని ఏపీసీసీ కార్యవర్గ సభ్యుడు అత్తింజేరి శ్రీనాథ్ ప్రశ్నించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం డీసీసీ నాయకులు వెంకటేష్, శ్రీనివాసులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని బహిరంగ సభలో ఇచ్చిన హామీ ఏమైందని బాబును నిలదీశారు. అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణం హామీని గాలికి వదిలేసి రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.15 వేల కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు.

### వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం చెదలవారిపల్లెకు చెందిన డిగ్రీ విద్యార్థి బాలాజీ(20) సొంత పనులపై బైక్‌లో పుంగనూరుకు వస్తుండగా, మార్గమధ్యంలోని నల్లగుట్టపల్లె వద్ద ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా సత్యసాయిజిల్లా కదిరి పట్టణం ఆర్ఎస్. రోడ్డుకు చెందిన అన్నదమ్ములు దాదాపీర్(20) అతడి తమ్ముడు అక్బర్(17) కురబలకోట మండలం అంగళ్లులోని బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి బైక్‌లో అమ్మమ్మ ఇంటికి వెళుతుండగా, మార్గమధ్యంలోని విశ్వం కళాశాల వద్ద కారును ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లెకు చెందిన ద్వారకనాథ్ భార్య లీలావతి(36) కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే ఉరివేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 వాహనంలో వాల్మీకిపురం కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు విచారణ చేస్తున్నారు.

### పాత విధానంలో పరీక్షలు నిర్వహించాలి

రాయచోటి : పాత విధానంలోనే పరీక్షలు నిర్వహించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జాబీర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం బుక్‌లెట్ అసెస్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఉపాధ్యాయులకు ఆటంకం కలుగుతున్నందున పాత విధానంలోనే పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. ఆదివారం రాయచోటిలోని వైవీ నాగిరెడ్డి డిగ్రీ కళాశాల ఆవరణంలో జరిగిన ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి పూర్తిగా మినహాయించాలన్నారు. ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రెడ్డిముని సుధాకర్, చిన్నమండెం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సహాధ్యక్షుడు కఫాయత్, వీరబల్లి మండల ప్రధాన కార్యదర్శి అమీనుల్లా, లక్కిరెడ్డిపల్లి నాయకులు రఫీబ్, ఆదిల్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

# జీవితాన్ని చదివేద్దాం.. బతికి సాధిద్దాం

మన తాతలు, తల్లిదండ్రులు అక్షరం ముక్క చదవకపోయినా జీవించారు. రెక్కల కష్టంతోనే ఐదుగురి నుంచి పదిమంది పిల్లలను పెంచి పోషించారు. ఇప్పుడున్న వసతులు, సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అప్పుడు లేవు. ఇప్పుడున్న యువత చదువు అర్థం కాకపోయినా, ఫెయిలైనా, తమకు నచ్చని చదువులు, వివిధ కారణాలతో ఒత్తిడికి లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. క్షణికావేశంతో తల్లిదండ్రుల ఆశలను మధ్యలోనే తుంచి కన్నీళ్లు మిగులుస్తున్నారు. విద్యార్థులు జీవితాన్ని చదవాలి.. బతికి సాధించాలి.


ట్రిపుల్ ఐటీ విద్యార్థి నరసింహనాయుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి(ఫైల్)

- చదువులు, తరగతి గదులు, వసతి గృహాల్లో ఇమడలేకపోతున్న విద్యార్థులు
- తల్లిదండ్రులూ ముందు జాగ్రత్తలు తీసుకోండి


మృతి చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి నరసింహనాయుడు (ఫైల్)

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఆరేళ్ల సమీకృత ఇంటిగ్రేటెడ్ కోర్సును చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి లోనై వసతి గృహాల్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత ఏడాది ఆగస్టు 8వ తేదీన ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పీయూసీ–2 (ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం) చదువుతున్న జమీషా ఖురేషి అనే విద్యార్థిని క్యాంపస్‌లోని వసతి గృహంలో ఉన్న బాత్రూంలో తన చున్నీతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. అలాగే చిత్తూరు జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి శివ కిటికీ అద్దాలను పగులగొట్టి చేతులను గాయపరచుకున్నాడు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని తోటి విద్యార్థితో ప్రేమలో పడి మూడంతస్తుల పై నుంచి దూకి మృతి చెందింది. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా ఏచ్చర్ల మండలం షేర్ మహమ్మదాపురం గ్రామానికి చెందిన పీయూసీ–2 విద్యార్థి జి. నరసింహనాయుడు ఉరివేసుకుని మృతి చెందాడు. కళాశాలలో రాత్రి పూట చాలాసేపు మేలుకొని చదువుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, తల్లిదండ్రులకు దూరంగా ఉన్నామని బెంగతో, హాస్టల్‌లో భోజనం సరిగా లేకపోవడంతో, తమకిష్టమైన చదువును చదవలేకనో, జీవితంపై విరక్తి చెంది ఈ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో ఇలాంటి సంఘటనలు నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి.

**పిల్లలే తమ సర్వస్వమని..**

పిల్లలే తమ సర్వస్వమని.. వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. సంపాదనలో అధిక భాగం విద్య కోసమే ఖర్చు పెడుతుంటారు. ఇదే సమయంలో ఇతర కుటుంబాల పిల్లలతో పోలుస్తుంటారు. ఇది మంచిది కాదు. ఇలా చేయడం వల్ల వారిలో ఆత్మన్యూనత భావం పెరుగుతుంది. చదువు పేరుతో నిరంతరం ఒత్తిడికి గురి చేయరాదు. ఉద్యోగం, ఇంటి బాధ్యతలు ఉన్నా పిల్లలతో రోజుకు గంట అయినా ఆప్యాయంగా మాట్లాడాలి. అప్పుడే వారిలో మానసిక పరిపక్వత కలుగుతుంది. నలుగురిలో ధైర్యంగా మాట్లాడగలుగుతారు. ఏది మంచో, ఏది చెడో తెలుసుకుంటారు. సమాజంలో ఎలా జీవించాలో, నలుగురితో ఎలా నడుచుకోవాలో నేర్చుకుంటారు. ఏదైనా సమస్య వస్తే నేరుగా తల్లిదండ్రులతో చెప్పుకునేలా అవకాశం కల్పించాలని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**ఒత్తిడి భరించలేకనే..**

ప్రస్తుతం అన్ని రంగాల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ప్రతి ఒక్కరూ కాలంతోపాటు పరుగులు తీయాల్సి వస్తోంది. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో ఈ ధోరణి ఎక్కువగానే ఉంది. మంచి మార్కులు, ర్యాంకులు వస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందనే భావనతో అందరూ ఉన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. ఇంట్లో ఉండి పిల్లలు తరగతి గదులు, తమకిష్టమైన చదువులను చదువుకోలేక, వసతి గృహాల్లో ఇమడలేక పోతున్నారు. అంతేకాకుండా ఫ్యామిలీ సమస్యలు, చిన్న, చిన్న సమస్యలకే తల్లడిల్లిపోతున్నారు. ఒక్కోసారి జీవితంపై విరక్తి చెంది కఠిన నిర్ణయాలు తీసుకుంటూ తల్లిదండ్రులకు శోకాన్ని మిగుల్చుతున్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు, మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

**పిల్లలకు భరోసా కల్పించాలి..**

గ్రామీణ విద్యార్థులు ఎక్కువ శాతం తెలుగు మాధ్యమంలో చదువుకుంటున్నారు. ఇంటర్‌లోకి వచ్చేసరికి ఆంగ్ల మాధ్యమం ఎంచుకుంటున్నారు. భవిష్యత్‌లో తెలుగులో కంటే ఇంగ్లిష్ మాధ్యమం చదివిన వారికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అపోహతో ఇంగ్లీషు విద్యనభ్యసిస్తున్నారు. అంతేకాకుండా ట్రిపుల్ ఐటీలలో ఇంగ్లీష్ మాధ్యమంతోపాటు తెలుగు మీడియంలో కూడా బోధన చేస్తుంటారు. అయితే పరీక్షలు మాత్రం ఇంగ్లీష్ మాధ్యమంలోనే రాయాలి. కంప్యూటర్ తదితర వాటిపై మంచి పట్టు ఉండాలి. ఓరియంటల్ తరగతుల్లో మాత్రం మూడు నెలలపాటు శ్రద్ధగా చదివితే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందులు ఉండవని ట్రిపుల్ ఐటీ అధికారులు భరోసా కల్పించాలి. ఒకేసారి భాషాపరమైన ఒత్తిడి, పోటీని తట్టుకుని నిలబడాలనే ఉద్దేశంతో శక్తికి మించి కష్టపడుతూ కుంగుబాటుకు లోనై ప్రాణాలు తీసుకుంటున్నారు. మొదటిసారి ఇంగ్లీష్ మీడియంలోకి వచ్చిన పిల్లలను దృష్టిలో ఉంచుకుని వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యాలపై ఉంది.

**వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలి..**

చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించాలి. మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించాలి. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలి. ఉన్నత విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి విద్యార్థుల సమస్యలు తెలుసుకుని భరోసా కల్పించాలి.

**చదువు జీవితంలో ఒక భాగం..**



చదువు అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే. ఇప్పటి ప్రపంచంలో మనం బతకడానికి ఎన్నో ఉపాయాలు, సాధనలు, అవకాశాలు ఉన్నాయి. చదువు రాకపోతే బతకలేమనేది అవాస్తవం. ఆత్మహత్య చేసుకునే ముందు విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుని నిండు జీవితాన్ని పాడు చేసుకోవద్దు. విద్యార్థులుగా మీరు ఆలోచించి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మానేయాలి. అమ్మ, నాన్న, అధ్యాపకులు కూడా పిల్లలు ఏ రంగంలో రాణిస్తున్నారో గుర్తించి.. అందులో వారిని ప్రోత్సహించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా పెంచుకోవాలి. విద్యార్థుల ప్రవర్తన, కదలికలను అనుక్షణం గమనించాలి. ఇప్పుడున్న యువత క్షణికావేశానికి ఎక్కువగా లోనవుతున్నారు. వారిని ముందే గుర్తించి కౌన్సిలింగ్ ఇస్తే ఫలితం ఉంటుంది.

– డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, ఆర్కే వ్యాలీ ప్రభుత్వాసుపత్రి, ఇడుపులపాయ

**ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నాం..**



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో ప్రవేశం కల్పించిన తర్వాత ఇంగ్లీష్ మీడియం కోర్సుపై పట్టును పెంచేందుకు ఓరియంటేషన్ తరగతులను నిర్వహిస్తున్నాం. ఎక్కువమంది ట్రిపుల్ ఐటీలలో గ్రామీణ ప్రాంత విద్యార్థులే ఉన్నారు. వారికి ఒక్కసారిగా ఇంగ్లీష్ మీడియం కోర్సులు ఇబ్బందికరంగా ఉంటాయి. అందుకే వారికి రెండు నెలలపాటు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నాం. కొన్ని సబ్జెక్టులు ఫెయిలైన వారికి రెమిడియల్ క్లాసులు నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా యోగా, మెడిటేషన్, వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించి తర్ఫీదు ఇస్తున్నాం. మానసిక వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించి ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తున్నాం.

– ఏపీఎస్ కుమారస్వామి గుప్తా, ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఇడుపులపాయ

### పోలీసు నిర్బంధంలో జిల్లా సాధన సమితి నేత

రాజంపేట : రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలంటూ జిల్లా సాధన సమితి జేఏసీ పేరుతో కార్యక్రమాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ రాజంపేట ఇన్‌చార్జి పూల భాస్కర్‌ను ఆదివారం పట్టణ పోలీసులు అక్రమంగా నిర్బంధించారు. కాగా సోమవారం రాజంపేటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారు. హక్కులను అడిగితే పోలీసులు నిర్బంధించడం అన్యాయమని పూల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా టీడీపీ నేతలు కొందరు జేఏసీ పేరుతో రాజంపేటను జిల్లాగా ప్రకటించాలని కార్యక్రమాలు చేశారు. అయితే వారిని ఎవరిని కూడా పోలీసులు నిర్బంధించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### ఐజేయూ సభ్యుడిగా ఎం.ప్రభాకర్‌రెడ్డి



రాయచోటి జగదాంబ సెంటర్ : ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ)లో అన్నమయ్య జిల్లాకు చోటు లభించింది. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ అన్నమయ్యకు అవకాశం కల్పిస్తూ నిర్ణయించింది. జిల్లా కమిటీ చేసిన ప్రతిపాదనను రాష్ట్ర కమిటీ ఆమోదించి, ఐజేయూ సభ్యుడిగా ఎం.ప్రభాకర్‌రెడ్డిని నియమిస్తూ అధికారికంగా ప్రకటించిందని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వంశీధర్ తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి నియామకం పట్ల జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, ఈశ్వర్, రాష్ట్ర సమితి సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రామచంద్రయ్య, వెంకటేష్, జిల్లాకు చెందిన జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

### బైక్ ఢీకొని నలుగురికి గాయాలు

నిమ్మనపల్లె : బైక్ ఢీకొని ఒకే కుటుంబంలో నలుగురు గాయపడిన సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లెకు చెందిన సుబహాన్(27) తన భార్య రమీజా(25), కుమారుడు నవాజ్‌బాషా(6), కుమార్తె ఉమియా తస్లీమ్(3)తో కలిసి బైక్‌లో వెళుతుండగా కొమ్మిరెడ్డిగారిపల్లె వద్ద మరో ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో గాయపడ్డారు. ప్రమాదంలో సుబహాన్, రమీజా తీవ్రంగా గాయపడగా, ఇద్దరు పిల్లలు స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

## రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలి


మాట్లాడుతున్న అఖిల పక్ష నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అఖిల పక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటిలోని డాక్టర్ అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపీడీఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. ఈశ్వర్ మాట్లాడుతూ రాయలసీమలోనే అత్యంత వెనకబడిన ప్రాంతం రాయచోటి అన్నారు. అలాంటి రాయచోటిని జిల్లా కేంద్రంగా ఉంచడం వలన ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. బాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన కోసమని మంత్రివర్గ కమిటీ వేశారన్నారు. దీనివలన అన్నమయ్య జిల్లా ప్రజల్లో ఆందోళన, గందరగోళం నెలకొందన్నారు. అన్ని అర్హతలు ఉన్న రాయచోటిని జిల్లా కేంద్రంగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీయస్ రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు, బీసీ సంఘం నాయకులు విజయభాస్కర్, నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ నాయకుడు విశ్వనాథ, రజక సంఘం నాయకులు రమేష్, శ్రీనివాసులు, రమణ, వడ్డెర సంఘం, విద్యావంతుల వేదిక నాయకుడు చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ నాయకుడు హరిబాబు, జనసేన నాయకుడు రామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

రాజంపేట రూరల్ : రాజంపేట పార్లమెంట్ స్థానాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి చంద్రయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం ఎదుట ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు సోమవారం పర్యటనలో ప్రకటించాలన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈ.సికిందర్, కార్మిక నాయకులు మహమ్మద్ హుస్సేన్, వేముల నరసింహులు, కాయల రమణ, వేంకప్ప, జీ రమణ, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

### అంగళ్లు చెరువులో భవన నిర్మాణ మేస్త్రీ మృతి


దేవేంద్ర (ఫైల్)

కురబలకోట : వినాయక నిమజ్జనంలో ఓ వ్యక్తి చెరువులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన విషాదకర సంఘటన కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు ప్రాంతం మోదుగులపల్లెకు చెందిన మేస్త్రీ దేవేంద్ర అలియాస్ నాగేంద్ర (35)కు భార్యా పిల్లలు ఉన్నారు. ఇతను కురబలకోట మండలం అంగళ్లులోని ఓ మహిళతో ఐదేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మండలంలోని చిన్నతట్టివారిపల్లె గ్రామస్తులు గణేష్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆనందంగా పాల్గొన్న ఇతను సమీపంలోని మల్లేశ్వరం చెరువు వరకు నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నాడు. నిమజ్జన సమయంలో చెరువులో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. చీకటి కావడంతో అప్పట్లో ఎవరూ గుర్తించలేదు. ఆదివారం ఉదయం చెరువులో శవమై కన్పించాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చెరువులో పడి మృతి చెందడం పట్ల అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మెగా రక్తదాన శిబిరం


మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఈనెల 2వ తేదీన మంగళవారం ఉదయం 6.30 గంటలకు స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో వైఎస్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. వైఎస్సార్‌కు ఘనంగా నివాళి అర్పించే కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, కుల సంఘాల, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పులివెందుల ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### విద్యుత్ షాక్‌తో బర్రె మృతి

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నె మండలం బాలుపల్లి నుంచి గోపులాపురం వెళ్లే దారిలో విద్యుత్ షాక్‌తో బర్రె మృతి చెందింది. బాలుపల్లి గ్రామానికి చెందిన బొమ్మేపల్లె నారాయణమ్మ పశువులను మేపుతుండగా రోడ్డు పక్కగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద బర్రెకు, నారాయణమ్మకు విద్యుత్ షాక్ తగిలింది. బర్రె మృతి చెందగా, నారాయణమ్మ స్వల్ప గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. సమీపంలోని గ్రామస్తులు స్పందించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా నారాయణమ్మను రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన బర్రె సుమారు లక్ష రూపాయలు పైగా విలువ చేస్తుందని, విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపించారు.

## సీజన్స్ ట్రోఫీ సాధించిన సీటీఎం క్రాస్‌రోడ్స్ టీం


విన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న సీటీఎం క్రాస్‌రోడ్ టీం

మదనపల్లె రూరల్ : రెండురోజులుగా జరుగుతున్న సెకండ్ సీజన్ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ పోటీల్లో సీటీఎం క్రాస్‌రోడ్ టీం విన్నర్‌గా నిలిచింది. ఆదివారం సీటీఎం క్రాస్‌రోడ్ టీం కెప్టెన్ అనిల్‌కు, మైఫోర్స్ మహేష్ విన్నర్స్ ట్రోఫీని అందించారు. రన్నర్‌గా నిలిచిన ముదివేడు దిన్నెమీదపల్లె టీంకు కేఎస్ఎస్.నూర్ బాబా బహుమతిని అందించారు. హోరాహోరీగా జరిగిన సెకండ్ సీజన్ ఛాంపియన్ ట్రోఫీ ఫైనల్ పోటీల్లో మొదటి 15 ఓవర్లకు సీటీఎం క్రాస్‌రోడ్ టీం 121 పరుగులు చేయగా, తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన ముదివేడు దిన్నెమీదపల్లె టీం 110 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఫైనల్ మ్యాచ్‌లో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన అనిల్, హరిబాబులను అభినందించారు. కార్యక్రమంలో ఎఫ్ఈసీసీ క్లబ్ డైరెక్టర్ హరిబాబు, వినయ్, దేవేంద్ర, గంగరాజు, మోని, మధు తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి బాలుడి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన శ్రీహరి

కమలాపురం : కమలాపురం పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన శ్రీహరి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రెడ్డీస్ కాలనీకి చెందిన నరసింహారావు కుమారుడు శ్రీహరి 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం వినాయక నిమజ్జనానికి వెళ్లి ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో చేయి తెగిపోవడంతో పాటు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం అయింది. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు విషయం తెలుసుకున్న కడప రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## స్మార్ట్ కిచెన్ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

చింతకొమ్మదిన్నె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం చింతకొమ్మదిన్నె జెడ్పీ హైస్కూల్ ఆవరణలో అధునాతన వసతులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్‌ను ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, ఎస్ఎస్ఏ, సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ స్కోరు సాధించిన చిత్తూరు, నెల్లూరు జట్లు


161 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ తేజరెడ్డి


63 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మన్ నిఖిత్‌గౌడ్


52 పరుగులు చేసిన కడప బ్యాట్స్‌మన్ శివ కేశవ రాయల్


182 నెల్లూరు బ్యాట్స్‌మన్ సోహన్ వర్మ


5 వికెట్లు తీసిన కర్నూల్ బౌలర్ అక్షిత్ రెడ్డి


3 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ నారాయణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ సౌత్ జోన్ అండర్–23 మల్టీ డే మ్యాచ్‌లలో చిత్తూరు, నెల్లూరు జట్లు భారీ స్కోర్లు చేశాయి. ఆదివారం రెండవ రోజు కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు–కడప జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 346 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన చిత్తూరు జట్టు 137. ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 589 పరుగులకు డిక్లేర్డ్ చేసింది. ఆ జట్టులోని వై. తేజ రెడ్డి 162 బంతుల్లో 20 ఫోర్లు, 5 సిక్సర్లతో 161 పరుగులు చేశాడు. నిఖిత్ గౌడ్ 63 పరుగులు చేశాడు. కడప జట్టులోని చెన్నారెడ్డి 3 వికెట్లు, ఎస్ఎండీ అస్లమ్ 2 వికెట్లు, ధనుష్‌రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కడప జట్టు 32.4 ఓవర్లలో తొలి వికెట్ కోల్పోయి 99 పరుగులు చేసింది. ఆ జట్టులోని శివ కేశవ రాయల్ 52 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 490 పరుగుల వెనుకంజలో ఉంది. దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

**వైఎస్ఆర్ఆర్ ఏసీఏ స్టేడియంలో..**

వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 374 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 96.4 ఓవర్లలో 514 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సోహన్ వర్మ 220 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 182 పరుగులు చేశాడు. భార్గవ్ 75 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని అక్షిత్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. సాయి ప్రణవ్ చంద్ర 2 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 41.5 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి గణేష్ 34 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని అఖిల్ 4 వికెట్లు, మాధవ్ 3 వికెట్లు, నారాయణ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 10 ఓవర్లకు వికెట్ కోల్పోకుండా 54 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 436 పరుగుల అధిక్యంలో ఉంది, దీంతో రెండవ రోజు ఆట ముగిసింది.

## ప్రజలకు అందుబాటులో నాణ్యమైన ఇంధనం

డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్


కలికిరిలో ఐఓసీఎల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కలికిరి : ప్రజలకు నాణ్యమైన ఇంధనం అందించడమే లక్ష్యంగా కలికిరిలో పోలీస్ వెల్ఫేర్ ఐఓసీఎల్ ఫిల్లింగ్ స్టేషన్ అందుబాటులోకి తెచ్చినట్లు కర్నూలు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. కలికిరి పోలీస్ స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన ఐఓసీఎల్ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి ఆయన ప్రారంభించారు. పోలీసులతో పాటు ప్రజలకు కూడా ఈ ఫిల్లింగ్ స్టేషన్‌తో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎంఆర్ క్రిష్ణమోహన్, ఐఓసీఎల్ సేల్స్ అధికారి వాసు. ఎంవీఐ ఎం.పెద్దయ్య, కలికిరి సీఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్య

రాయచోటి : రాయచోటి పట్టణం పీటీఎం పల్లెకు చెందిన నందిని(36) ఆదివారం ఉదయం అమ్మగారి ఇంటిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. 15 సంవత్సరాల కిందట సంబేపల్లి మండలం, రైతుకుంట గ్రామం, పోతువాండ్లపల్లి దళితవాడకు చెందిన బరుగు శివ కు ఇచ్చి వివాహం చేశారు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. బరుగు నందిని ప్రతిరోజు కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు, అయితే గత కొద్దిరోజులుగా నందిని భర్త అనుమానంతో ఆమెను మానసికంగా, శారీరకంగా హింసించేవాడని సమాచారం. శనివారం సాయంత్రం భార్యాభర్తలిద్దరూ గొడవపడి నందినిని రాయచోటి పట్టణం పూలతోట దళితవాడలోని అమ్మగారి ఇంటి వద్ద వదిలేసి తిరిగి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో బరుగు నందిని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయింది. సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.